క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఉదయం తలసీమియా పిల్లల కోసం బ్లడ్ డొనేషన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మా ఊరి సినిమా హీరో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసి తలసీమియా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. రక్తదానం చేయడంవల్ల తలసీమియా వ్యాధిగ్రస్తులైన పిల్లల ఆరోగ్యాన్ని కాపాడినవారవుతారన్నారు.

తల్లిపాలు అమృతం లాంటివి


మాట్లాడుతున్న సీడీపీఓ షంషాద్ బేగం

కమలాపురం: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్ బేగం తెలిపారు. సోమవారం కమలాపురం అంగన్వాడీ సెక్టార్ పరిధిలోని 7, 8,1,2, 15వ వార్డు 1వ అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గౌసియా బేగం, ఎలిజిబెత్ రాణి, జ్యోతి, డి.రాణి, లక్ష్మీదేవి, క్రిష్ణవేణి, గీతా, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

నేడు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం

జమ్మలమడుగు: రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఉదయం సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఇక్బాల్ బాషా సోమవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పదకొండుగంటలకు ఆర్డీఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఆర్డీఓ ఛాంబర్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా పార్టీలకు చెందిన ప్రతినిధులు సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వరి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి


జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ, తదితరులు

చెన్నూరు : రైతులు వరి పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బయనపల్లె యూనిట్, రామనపల్లె గ్రామ పొలాల్లోని వరి పొలాలను ఏఓ శ్రీదేవి, వెలుగు ఏపీఎం గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీదేవి మాట్లాడుతూ వరి పంటలలో జీవామృతం ఎలా వాడాలి, వరి పొలంలో మెళకువలు ఏ విధంగా పాటించాలి, చీడ, పీడల వల్ల పంటలను ఏ విధంగా కాపాడుకోవాలి వంటి విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల పీఆర్పీ మేరి, యూనిట్ ఇన్‌చార్జి వెంకటయ్య, ఐసీఆర్‌పీఏ లక్ష్మి, పూజిత, ఎస్.సునీత పాల్గొన్నారు.

గంగమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ


గంగమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుడిపల్లెలోని రజక కాలనీలో సోమవారం గంగమ్మ గుడి నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ఒక ఉద్యమంలా ప్రతి గ్రామానికి దేవాలయాలను మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమణారెడ్డి, మున్సిపల్ కో.ఆప్షన్ మెంబర్ డి.చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు డేనియల్ బాబు, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు రక్షణకు అంకితమవుదాం

కడప కల్చరల్ : వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈనెల 29వ తేదీన తెలుగు అభిమానులంతా భాషా రక్షణకు ప్రతినబూనాలని తెలుగుభాషా వికాస ఉద్యమ అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంత రావు అన్నారు. సోమవారం కడప నగరంలోని కోటిరెడ్డిసర్కిల్‌లోని మొల్లమాంబ విగ్రహానికి పూలమాల అలంకరించి భాషారక్షణకు అంకితమవుదామని భాషాభిమానులతో కలిసి ప్రతినబూనారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి


ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం మండలంలోని సి.రాజుపాళెం, జి.అప్పాయపల్లె గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, డ్రైనేజ్, విద్యుత్ స్తంబాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఏ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో వివరిస్తూ, ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అందుకే ప్రభుత్వ సిబ్బంది అంతా ప్రజల ముంగిటకు వచ్చిందన్నారు. ఏపీలో అమలవుతున్నన్ని పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అవ్వా తాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750, ప్రతి తల్లికి అమ్మ ఒడి దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు.

హామీలిచ్చి విస్మరించిన చంద్రబాబు:

గతంలో చంద్రబాబు నాయుడు దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని ఒక్క హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. బాబు తన పాలనంతా అవినీతికి పాల్పడ్డారని, జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చారన్నారు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, సర్పంచులు రాజారెడ్డి, రవి శంకర్, ఇతర నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నిఖిల్‌రెడ్డి, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం


కార్యకర్తలతో మాట్లాడుతున్న వైఎస్ కొండా రెడ్డి

చక్రాయపేట: గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని చక్రాయపేట మండల ఇన్‌చార్జ్ వైఎస్ కొండారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ఇడుపులపాయలోని వైఎస్ అతిథి గృహంలో తనను కలసిన మండల కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సహకారంతో మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు.ఇంకా ఏవైనా శాశ్వత అభివృద్ధి పనులు ఏవైనా ఉంటే వాటిని ముఖ్యమంత్రి జగనన్న దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు.కార్యక్రమంలో ఎంపీపీ మాధవీబాలకృష్ణ,మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి,మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య,పార్టీ నేతలు రామచంద్రారెడ్డి, లక్షుమయ్య, మల్‌రెడ్డి, జనార్ధనరెడ్డి, రఘునాథరెడ్డి, అంజలిరెడ్డి, మునిరత్నంరెడ్డి, బ్రంహానందరెడ్డి,నాగిరెడ్డి,రెడ్డిరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా అందించాలి


మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ

కమలాపురం: రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాను అందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ తెలిపారు. సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. గత నెలలో రైతులతో నిర్వహించిన సదస్సులో వచ్చిన ఫిర్యాదులు పూర్తి అయ్యే వరకు ప్రతి సోమవారం పర్యటిస్తానన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో ఎక్కువగా అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇక నుంచి పల్లెనిద్ర చేస్తానని, అంతరాయాలు వస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ముందస్తు మరమ్మతులు చేపట్టి ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణకు చర్యలు చేపట్టండి

ఆర్డీఓ వెంకటేశులు


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

పులివెందుల టౌన్ : భ్రూణ హత్యల నివారణకు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ వెంకటేశులు అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోని ఆర్డీఓ చాంబర్‌లో సబ్ డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ లెవెల్ అడ్వయిజరీ కమిటీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకటేశులు మాట్లాడుతూ భ్రూణ హత్యల నివారణకు స్కానింగ్ కేంద్రాలపై పూర్తిస్థాయి నిఘా ఉంచాలన్నారు. అలాగే కళాజాత బృందాల ద్వారా భ్రూణ హత్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే అబార్షన్ కోసం వాడే మాత్రలను డాక్టర్ సిఫారసు లేకుండా మందులు ఇచ్చే దుకాణాలు, ఏజెన్సీలపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బందిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఇన్‌చార్జి డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అరిఫుల్లా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్, డాక్టర్ లక్ష్మిప్రియ, గైనకాలజిస్ట్ డాక్టర్ సుభశ్రీ, డీఈఓ రాఘవరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆసుపత్రి సిబ్బంది నరేష్, బాషా, సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి


మాట్లాడుతున్న ఏఓ చెన్నారెడ్డి

వేముల : వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఏఓ చెన్నారెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వర్షాభావ పరిస్థితులవల్ల వేరుశనగ, పత్తి పంటలు సాగు కాలేదన్నారు. ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలైన అలసందలు, కందులు, ఉలవలు, మినుములను 80శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు సంబంధించి ధరలు నిర్ణయిస్తూ ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అవసరం ఉన్న రైతులు ఆయా ఆర్‌బీకేలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆగస్టు 14వ తేదీలోపు నమోదు చేసుకున్న రైతుల జాబితాను ఉన్నతాధికారులకు నివేదిస్తే విత్తనాలు మంజూరవుతాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆర్‌బీకేలలో యూరియా, తెల్ల పొటాష్, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

అనుమతి లేని దుకాణాలను తొలగించండి

మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అనుమతి లేకుండా వేసిన వ్యాపార సముదాయాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం యర్రగుంట్ల బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో బస్సులు తిరగడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటే ఇప్పుడు మళ్లీ వ్యాపారం కోసం ప్రైవేటు వ్యక్తులతో బంకులను ఏవిధంగా వేయించారని మండిపడ్డారు. వెంటనే బస్టాండ్ ఆవరణలో వేసిన బంకులు తొలగించి ప్రయాణికులకు కుర్చీలు వేయించాలని ఆదేశించారు. ఓ ప్రైవేటు వ్యక్తి స్థలం మాది అంటు వచ్చి తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారిని బెదిరించి వారితో బాడుగలు వసూలు చేస్తున్నారని స్థానికులు తెలియజేశారు. దీంతో మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి ఆగ్రహించి ఆ వ్యక్తికి ఏ విధంగా అనుమతి ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఆర్టీసీ డీఎం మల్లిఖార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్, కో-ఆప్షన్ సభ్యులు డి సూర్యనారాయణరెడ్డి, ఆర్ఓ గంగిరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు సుబ్రహ్మణ్యం

వేంపల్లె : జిల్లాలో ఈనెల 30వ తేదీన జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట్రాములు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్టీయూ ఆఫీసులో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అనే పేరుతో జరిగే సీపీఐ 26జిల్లాల బస్సు యాత్రను చేపట్టడం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పాలన విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అమలుపరుస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, తిరోగమన విధానాలను ఎండగట్టడానికి, తద్వారా ప్రజలను చైతన్యపరచడానికి సీపీఐ ఈ యాత్ర చేపట్టిందన్నారు. సీపీఐ పులివెందుల ఏరియా సహాయ సభ్యులు బాష, జిల్లా సమితి సభ్యులు ఓబయ్య, సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత దంత వైద్య శిబిరం


దివ్యాంగ విద్యార్థికి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

వేంపల్లె : వేంపల్లెలోని స్థానిక దివ్యాంగుల భవిత కేంద్రంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డెంటిస్ట్ అన్వర్ ఉల్ హక్ ఆధ్వర్యంలో దాదాపు 30మంది దివ్యాంగ విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దంతాలకు హాని కలిగించే చాక్లెట్లు తినొద్దని, పండ్లు ఫలాలు తినాలని సూచించారు. అలాగే భోజనం చేసిన తర్వాత కూడా దంతాలను శుభ్రపరుచుకోవాలన్నారు. అనంతరం దంతాలకు బ్రష్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు టూత్ పేస్ట్, బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, ఐఈఆర్టీలు యశోద, సుజాత, ఫిజియోథెరపిస్ట్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జాతీయ చేనేత దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆప్కో సేల్స్ ఎంపోరియం సంస్థ చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కనీసం ఒక్క రోజైనా చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన ఫ్యాషన్ షో పోటీలను నిర్వహించారు. అనంతరం ఆప్కో సేల్స్ ఎంపోరియం సంస్థ చేనేత వస్త్రాలను విద్యార్థినులకు బహుమతులుగా అందించారు. వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధీర, పీఆర్ బాలనారాయణ, ఆప్కో సేల్స్ ఎంపోరియం మేనేజర్ రవి శంకర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాల వినియోగం పెంచాలి

– వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ : ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని, వినియోగం విస్తత ప్రచారం నిర్వహించాలని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం సందర్భంగా వైవీయూలో చేనేత వస్త్రాల వినియోగంపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, వేషధారణ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. అనంతరం పలువురు విద్యార్థులు చేనేత వస్త్రధారణలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా మాట్లాడుతూ స్వదేశీ వస్త్రాల గురించి వివరించారు. చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా దేశ జాతీయ ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఆప్కో మెగా షోరూం మేనేజర్ సి. రామకృష్ణ మాట్లాడుతూ చేనేత వస్త్రాల తయారీ, వినియోగం, ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం కళాశాలలో ఆప్కో చేనేత వస్త్రాల స్టాల్‌ను నిర్వహించి విద్యార్థినులకు రాయితీపై వస్త్రాలను అందజేశారు.

అధికారులు జాప్యం లేకుండా చూడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో అధికారుల జాప్యం, వివక్షత కారణంగా వారు ఇక్కట్లు పడుతున్నారని జాతీయ చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున తెలిపారు. సోమవారం కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవ్వారు మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికుడికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి ఎన్‌హెచ్‌డీసీ పథకం అమలు చేయాలని కోరారు.

పథకాలు పొందాలంటే అర్హతే ప్రామాణికం

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఎవరి సిఫారసులతో అవసరం లేదని, అర్హత ఉంటే చాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం ×గడప గడపకు మన ప్రభుత్వం× కార్యక్రమంలో భాగంగా 45వ డివిజన్ పరిధిలోని ఊటుకూరు, చెమ్ముమియ్యాపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోదావరి విశాలాక్షి అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నావడ్డీ, పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం ద్వారా రూ.10.29లక్షల మేలు చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. మామిడి అలివేలు మంగమ్మ అనే మహిళ మాట్లాడుతూ తమకు వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం వల్ల రూ.9.41లక్షల లబ్ధి చేకూరిందన్నారు. వి. హారతి అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం ద్వారా రూ.9.15లక్షల మేలు జరిగిందని తెలిపారు. పేదలకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసురెడ్డి, కార్పొరేటర్లు షఫీ, బాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, రహీం పాల్గొన్నారు.

పునీతుల అవశేషాల దర్శనం మన భాగ్యం

కడప కల్చరల్: పునీతులైన వారి అవశేషాలను దర్శించుకోవడం మన భాగ్యమని రెవడెండ్ బిషప్ డాక్టర్ గాలి బాలి అన్నారు. కడప నగరం మరియాపురం బిషప్ హౌస్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రెండవ జాన్‌పాల్ పోప్ అవశేషం పది రోజులుగా తెలుగు రాష్ట్రాలలోని 11 ప్రధాన పట్టణాలలో ప్రదర్శనగా వస్తుందని ఏప్రిల్ నెలలో ఈశాన్య రాష్ట్రాలో మొదలైన యాత్ర 22 రాష్ట్రాల మీదుగా ఆయా ప్రాంతాల విశ్వాసులకు అవశేషాలను దర్శింప చేస్తున్నారని తెలిపారు. ఆ యాత్రలో భాగంగానే జీసెస్ యూత్ ఆధ్వర్యంలో నేడు కడపకు ఆ అవశేషాలను ప్రజల దర్శనార్థమై తీసుకరావడం మన భాగ్యమేనన్నారు. క్రైస్తవ గురువులు ఎంపిపిఎస్ డైరెక్టర్ సాగర్ బాలరాజు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడం మనిషి ధర్మం


రక్తదానం చేస్తున్న యువకులు

జమ్మలమడుగు: ఆపదలో ఉన్న వ్యక్తులను ఆదుకోవడం మనిషిగా మన ధర్మమని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ పేర్కొన్నారు. సోమవారం ఆస్థానయే గౌసియాలో ఖూన్ కా రిస్తాలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు రక్తదానం చేయడం కోసం ముందుకు రావలన్నారు. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడితే వారి కుటుంబాన్ని కాపాడిన వారు అవుతారన్నారు. అనంతరం యువకులు రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ షా భక్తియార్ ఖాద్రీ, సయ్యద్‌షా అవులియాఖాద్రీ, సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

కమలాపురం: బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టవద్దని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులుతో ఆయన మాట్లాడారు. చదిపిరాళ్ల గ్రామానికి చెందిన పాలగిరి కొండారెడ్డికి సంబంధించిన రైతు భరోసా, పత్తి పంట బీమా నగదు రూ.20వేలు ఖాతాలో ఉన్నప్పటికి ఇవ్వకుండా నెల రోజుల నుంచి ఎందుకు తిప్పుతున్నారని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజలు ఇబ్బందులు పడకూడదని సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారన్నారు. అలాంటిది మీరు ఆ డబ్బు పట్టుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ చాలా బ్యాంకులు లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని, ఇలా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సుబ్బారెడ్డి, రామ సుబ్బారెడ్డి, మైసూరారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

శాంతి సమాజ స్థాపనకు కృషి చేయాలి


విజేతలతో ఉపాధ్యాయ సిబ్బంది

కమలాపురం: ఒకరి భావాలను మరొకరు గౌరవించుకుని శాంతి సమాజ స్థాపనకు కృషి చేయాలని అప్ కాస్ట్ జిల్లా అకడమిక్ కో-ఆర్డినేటర్ ఆర్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దచెప్పలి హైస్కూల్‌లో ఆంధ్ర ప్రదేశ్ సాంకేతిక మండలి ఆధ్వర్యంలో హిరోషిమా నాగసాకి డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవిస్తూ ఒకరి భావాలు మరొకరు గౌరవిస్తూ శాంతి సమాజాన్ని స్థాపించేందుకు కృషి చేయాలన్నారు. అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు అణుశక్తి పై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి మోటార్ల నిర్వహణపై దృష్టి సారించండి

– మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి


ఫిల్టర్ హౌస్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : నీటి మోటార్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మంచి నీటిని సరఫరా చేసే ఫిల్టర్ హౌస్, వాటర్ పంపింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫిల్టర్ హౌస్ సమీపంలో ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిష్పత్తి ప్రకారం నీటిలో క్లోరిన్, ఆలం కలిపి నీటిని సరఫరా చేయాలని సూచించారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరు ఏక్‌నాథ్ యాదవ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతిలు మాట్లాడుతూ పే స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. అర్హులకు పదోన్నతులు కల్పించాలన్నారు. డీఏ రికవరీ ఆపి డీఏతో కూడిన వేతనం అమలు చేయాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23, 24 తేదీలలో విజయవాడలో దీక్షలు చేపడతామన్నారు. 25న జగనన్నకు నేరుగా చెబుతాం పేరిట చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఈ దీక్షల్లో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, కోశాధికారి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.